ప్రజాశక్తి
ఆదివారం 9 ఏప్రిల్ 2023 5 శ్రీ సత్యసాయి

'రైతన్న'తో నారా లోకేష్'....

పోలీస్ బాస్‌ల బదిలీలు

◆ డిఐజి, ఇద్దరు ఎస్పీలకు స్థాన చలనం ◆ డిఐజి రవిప్రకాశ్ స్థానంలో అమ్మిరెడ్డి

◆ అనంతకు కె.శ్రీనివాసరావు ◆ సత్యసాయికి ఎస్‌వి.మాధవరెడ్డి

అనంతపురం ఎస్పీ... కె.శ్రీనివాసరావు

సత్యసాయి జిల్లా ఎస్పీ... ఎస్.వి.మాధవరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రెండు రోజుల క్రితం జిల్లా కలెక్టర్ల బదిలీలు జరిగిన వెంటనే పోలీసు ఉన్నతాధికారుల బదిలీలు జరిగాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అనంతపురం రేంజ్ డిఐజితోపాటు అనంతపురం, పుట్టపర్తి జిల్లాల ఎస్పీలు బదిలీ అయ్యారు. అనంతపురం రేంజ్ డిఐజి రవిప్రకాశ్‌ను సెబ్ డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ జనరల్‌గా బదిలీ అయ్యారు. ఆ స్థానంలోకి ఎఐజి డిఐజిగానున్న ఆర్‌ఎన్.అమ్మిరెడ్డిని నియమించారు. అనంతపురం ఎస్పీగానున్న ఫక్కీరప్పను సిఐడి ఎస్పీగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో వెయిటింగ్‌లో కె.శ్రీనివాసరావును నియమించారు. పుట్టపర్తి ఎస్పీగానున్న రాహుల్‌దేవ్ శర్మను ఐదవ బెటాలియన్ కమాండెంట్‌గా నియమించారు. ఈ స్థానంలో ఎస్‌వి.మాధవరెడ్డిని పుట్టపర్తి ఎస్పీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

గ్రూపువన్ ఆఫీసర్‌గా చేరి డిఐజిగా ఆర్‌ఎన్.అమ్మిరెడ్డి

ఆర్‌ఎన్.అమ్మిరెడ్డి 2001లో గ్రూపు వన్ ఆఫీసర్‌గా ఉద్యోగంలో చేరారు. తిరుపతి అర్బన్ అడిషనల్ ఎస్పీగానూ, గుంటూరు విజిలెన్సు ఎస్పీగానూ పనిచేశారు. 2009లో ఐపిఎస్ కన్‌ఫర్డ్ అయిన తరువాత శ్రీకాకుళం ఎస్పీగానూ, గుంటూరు అర్బన్ ఎస్పీగానూ పనిచేశారు. ప్రస్తుతం ఎఐజి లా అండ్ ఆర్డర్‌లో పనిచేస్తున్నారు. ఆయన్ను అనంతపురం రేంజ్ డిఐజిగా ప్రభుత్వం ఇప్పుడు నియమించింది.

అనంతపురం ఎస్పీగా కె.శ్రీనివాసరావు

అనంతపురం జిల్లా ఎస్పీగా కె.శ్రీనివాసరావు నియమితులయ్యారు. గ్రూపు ఆఫీసర్‌గా పోలీసు శాఖలో చేరిన శ్రీనివాసరావు శ్రీకాకుళం సెబ్ ఎస్పీగానూ, విజయవాడ అసిస్టెంట్ కమిషనర్‌గానూ పనిచేశారు. వెయింటింగ్‌లో ఉన్న ఆయన్ను ఇప్పుడు అనంతపురం జిల్లా ఎస్పీగా నియమించారు.

పుట్టపర్తి ఎస్పీగా ఎస్‌వి.మాధవరెడ్డి

2010 గ్రూపు వన్ అధికారిగా ఉద్యోగంలో చేరిన ఎస్‌వి.మాధవరెడ్డి పుట్టపర్తి ఎస్పీగా నియమితులయ్యారు. ఫారెస్టు రేంజ్ ఆఫీసర్‌గా విధుల్లోకి మొదట చేరారు. ఆ తరువాత డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫీసర్‌గా నిర్మల్, కర్నూలు జిల్లా ఆత్మకూరు డీఎస్పీగా వచ్చారు. 2018లో అడిషనల్ ఎస్పీగా ఉద్యోగోన్నతి పొందారు. గుంటూరు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారిగానూ పనిచేశారు. ప్రస్తుతం ఆయన వెయిటింగ్‌లోనున్నారు. ప్రస్తుతం పుట్టపర్తి ఎస్పీగా నియమితులయ్యారు.

రైతులకు తోడుగా ఉంటాం

◆ అన్నదాతలను విస్మరించిన వైసిపి

◆ యువగళం పాదయాత్రలో నారా లోకేష్

◆ జంబలదిన్నెలో రైతులతో ముఖాముఖి

◆ 64వ రోజు ముగిసిన పాదయాత్ర

రైతుతో మాట్లాడుతున్న నారా లోకేష్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి/గార్లదిన్నె

టిడిపి అధికారంలోకి రాగానే అన్ని విధాలా వారికి తోడుగా ఉంటామని, వ్యవసాయానికి సాయం అందిస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ హామీనిచ్చారు. యువగళం పాదయాత్ర 64వ రోజు శనివారం నాడు పాదయాత్రకు విరామం ఇచ్చారు. గార్లదిన్నె మండలం జంబులదిన్నె వద్ద 'రైతన్నతో లోకేశ్' పేరుతో రైతులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్‌కెయు ప్రొఫెసర్ రాంప్రసాద్ హోస్టుగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో రైతులు అడిగిన పలు ప్రశ్నాలకు లోకేష్ సమాధానం చెప్పారు. రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో నారా లోకేష్ వైసిపి ప్రభుత్వ వైఫల్యాలతోపాటు, తాము అధికారంలోకి వస్తే తీసుకోబోయే చర్యలను వివరించారు. వైసిపి అధికారంలోకి రాక ముందు అంటే 2019 కంటే ముందు తలసరి రైతు రుణం రూ.70 వేలు ఉంటే ఇప్పుడు అది రూ.2.50 లక్షలకు చేరిందన్నారు. రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని చెబుతున్న వైసిపి ప్రభుత్వ మాటలు ఒట్టి బూటకమన్నారు. పంటలబీమాను ప్రభుత్వమే కంపెనీని స్థాపించి ప్రకృతి వైపరిత్యాలతో పంటనష్టపోయిన రైతులను ఆదుకుంటమని చెబుతోంది, కాని ఆచరణలో అది ఎక్కడా అమలు జరగలేదన్నారు. అనంతపురం జిల్లాలో ఇటీవలి కాలంలో తుఫానుతో ఉద్యానవన రైతులు తీవ్రంగా నష్టపోయారని గుర్తు చేశారు. వారిని ఆదుకునే అంశంపై ఇప్పటి వరకు నిర్ధిష్టమైన ప్రకటన కూడా చేయలేదని విమర్శించారు. పంటనష్ట పరిహారం చెల్లించే విషయంలోనూ ఈ ప్రభుత్వం రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. వైసిపికి అనుకూలంగానున్న కొద్ది మందికి పరిహారం ఇచ్చిన తక్కిన వారికివ్వడం లేదని విమర్శించారు. రైతు ఆత్మహత్యల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే మూడవ స్థానంలో ఉందన్నారు. కౌలు రైతు ఆత్మహత్యల్లో అయితే రెండవ స్థానంలో ఉందన్నారు. కౌలు రైతులను ఈ ప్రభుత్వం పూర్తిగా విస్మరిసోందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే సాధారణ రైతులతో సమానంగా కౌలు రైతులను ఆదుకుంటుందని భరోసానిచ్చారు. రైతులను ఆదుకుంటామని ఈ ప్రభుత్త్వం ఆర్భాటంగా రైతు భరోసా కేంద్రాలు ప్రారంభించిందని గుర్తు చేశారు. తాను పాదయాత్ర చేసిన ఇన్ని రోజుల్లో ఎక్కడా రైతు భరోసా కేంద్రం తెరచి ఉన్న దాఖలాల్లేవని అన్నారు. మద్యం దుకాణాలు మాత్రం ఎప్పుడూ తెరచి ఉంటాయని ఎద్దేవా చేశారు. తెలుగుదేశం ప్రభుత్వం వస్తే రైతులను ఏ రకంగా ఆదుకుంటారని రైతులు అడిగిన ప్రశ్నకు ఆయన స్పందిస్తూ రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీలను పెంచి పెట్టుబడి ఖర్చులు తగ్గిస్తామని, మార్కెటింగ్‌ను అనుసంధానం చేసి గిట్టుబాటు ధర లభించే విధంగా చర్యలు చేపడామన్నారు. ఉద్యావన పంటలు అధికంగానున్న చోట ప్రాసెసింగ్ పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. వైసిపి అధికారంలోకి వచ్చాక సాగునీటి రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. తాము అధికారంలోకి ఉండగా రూ.11 వేల కోట్లతో సాగునీటి ప్రాజెక్టులు చేపట్టినట్టు వివరించారు. వీరు వచ్చాక బిందు, తుంపెర సేద్యాన్ని అటకెక్కించారని విమర్శించారు. టిడిపి హయాంలో పెద్దఎత్తున బిందు,తుంపెర సేద్య పరికరాలను సబ్సిడీకి అందించామని, రాబోయే రోజుల్లోనూ ఇది కొనసాగుతుందన్నారు. వ్యవసాయ అనుబంధ రంగమైన పాడి పరిశ్రమ అభివృద్ధికి గట్టి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో మాజీ మంత్రుల కాలవ శ్రీనివాసులు, పరిటాల సునీత, సత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షులు బికె.పార్ధసారథి, బండారు శ్రావణి, ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి, ఆలం నర్సానాయుడుతోపాటు వివిధ నియోజకవర్గాల నుండి వచ్చిన రైతులు పాల్గొన్నారు.

ఆగిపోయిన ప్రాజెక్టు వద్ద సెల్ఫీ తీసుకుంటున్న టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి

ఆపేసిన పనులు పూర్తి చేయండి

వైసిపికి 'గుండుమల' సెల్ఫీ ఛాలెంజ్

ప్రజాశక్తి-మడకశిర/మడకశిర రూరల్

నియోజకవర్గవ్యాప్తంగా గత టిడిపి హయాంలో చేపట్టి అర్థాంతరంగా ఆపేసిన పనులను వైసిపి సర్కారు పూర్తి చేయాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం టిడిపి హయాంలో చేపట్టి నిలిచిపోయిన పనుల వద్ద సెల్ఫీ దిగి ప్రభుత్వానికి ఛాలెంజ్ విసిరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడికొండ చెక్‌పోస్ట్ నుంచి సిరా వరకు నేషనల్ హైవే (జాతీయ రహదారి) తెచ్చామన్నారు. అదేవిధంగా మడకశిర పరిధిలో చీపులేటి గ్రామం వద్ద గార్మెంట్ ఫ్యాక్టరీని వందశాతం పూర్తి చేయించామన్నారు. కానీ మీరు వచ్చాక ప్రారంభించలేకపోయారన్నారు. ఈ ఫ్యాక్టరీని ప్రారంభించి ఉంటే నియోజకవర్గవ్యాప్తంగా దాదాపు 3వేల మంది నిరుద్యోగులకు ఉపాధి దొరికేదన్నారు. అదేవిధంగా పట్టణ సుందరీకరణం కోసం అప్పటి టిడిపి ప్రభుత్వం కోట్లు వెచ్చించి డివైడర్ ఏర్పాటు చేసి మధ్యలో బట్టర్‌ప్లై లైట్లు అమర్చామన్నారు. వీటితోపాటు పావగడ రోడ్డు, పెనుకొండ రోడ్డు, పట్టణంలో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశామన్నారు. పట్టణంలో మిగిలిపోయిన హిందూపురం రోడ్డు, మధుగిరి రోడ్డు, అమరాపురం రోడ్డుమార్గంలో ఈ ప్రభుత్వం వచ్చిన నాలుగేళ్లలో ఒక్క కరెంటు స్తంభాలు కూడా ఏర్పాటు చేయలేకపోయారని విమర్శించారు. అలాగే జూనియర్ కళాశాల క్రీడా ఆవరణలో ఇండోర్ స్టేడియాన్ని దాదాపుగా పూర్తి చేశామన్నారు. అయితే ఈ ప్రభుత్వం వచ్చాక చిన్న చిన్న పనులు చేసి పూర్తి చేయలేకపోయిందని దుయ్యబట్టారు. మంజూరైన రింగ్ రోడ్డు పనులను 40శాతం పూర్తికాగా వైసీపీ ప్రభుత్వం వచ్చాక పూర్తిగా రద్దు చేసిందన్నారు. అలాగే హంద్రీనీవా ద్వారా సాగు, తాగునీరు తెచ్చామన్నారు. రొళ్ల, అగలి, గుడిబండ, అమరాపురం మండలాల్లో ఉండే హంద్రీనీవా కాలువ పనులు పూర్తి చేయలేకపోయారన్నారు. ఇప్పటికైనా వైసిపి నాయకులు భేసజాలకు పోకుండా అర్ధాంతరంగా ఆపేసిన పనులను పూర్తి చేయాలని ఆయా పనుల వద్ద సెల్ఫీలు దిగి ఛాలెంచ్ విసిరారు. ఆయన వెంట రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి, కన్వీనర్లు మనోహర్, లక్ష్మీనారాయణ, మద్దనకుంటప్ప పాల్గొన్నారు.

సర్వే చేయించి చిత్తశుద్ధి నిరూపించుకోండి

◆ వైసిపి అక్రమాలను ఎండగట్టేందుకే యువగళం పాదయాత్ర

◆ టిడిపి ధర్మవరం నియోజకవర్గం ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్

విలేకరులతో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ధర్మవరం చెరువుకు అనుకుని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి గుర్రాల కోట నిర్మించుకున్న భూమి కొనుగోలు చేసిందా..? ఆక్రమించుకున్నదా.? అన్నది నిజాయితీగా సర్వే చేయిస్తే తెలుస్తుందని టిడిపి ధర్మవరం నియోజకవర్గం ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. శనివారం ఉదయం అనంతపురం నగరం అరవింద నగర్‌లోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి భూ ఆక్రమణపై తాము ఆధారాలతో సహా వాస్తవాలు వెల్లడించామన్నారు. దీనిని జీర్ణించుకోలేక యువగళం పాదయాత్ర, యువనేత నారా లోకేష్ నడకపై వ్యగ్యంగా విమర్శలు చేయడం హస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వైసిపి అక్రమాలను ఎండగట్టేందుకే నారా లోకేష్ యువగళం పాదయాత్ర చేస్తున్నారని చెప్పారు. ధర్మవరం జరుగుతున్న అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు కేతిరెడ్డి ఇలా నీచరాజకీయాలు చేస్తున్నారని చెప్పారు. గుర్రాలకోటలో మ్యాప్ ప్రకారం భూమి ఉన్నట్లయితే మిగతా భూమి ఎవరిదో అన్న విషయమైన ప్రజలకు తెలపాలన్నారు. బాధ్యతాయుతమైన ఎమ్మెల్యే పదవిలో ఉన్న ఆయన వాస్తవాలను ప్రజలకు తెలియజేసి నిజాయతీని నిరూపించుకోవాలన్నారు. ఆక్రమిత భూమి జి.సూర్యనారాయణ, అలియాస్ మేడాపురం సూరి అనే వ్యక్తిది అంటున్నారని, సదరు సూరి అనే వ్యక్తి ఎమ్మెల్యేకు అత్యంత ఆప్తుడన్న విషయం ధర్మవరం నియోజకవర్గం ప్రజలందరికీ తెలుసన్నారు. బస్టాంట్ దగ్గర బ్రాహ్మణుల భూమి వివాదంలో మేడాపురం సూరి ఉన్నది నిజం కాదా అన్నారు. అక్రమాలు చేశారంటూ ప్రశ్నించిన వారిపై లేనిపోని అవాకులు, చవాకులు చేస్తే సహించేది లేదన్నారు. తాను ధర్మవరం వస్తే హింస, హత్యలు, దాడులు పెరుగుతాయని, కత్తులు, బాంబుల సంస్కృతి పునరావృతం అవుతుందంటూ కేతిరెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని చెప్పారు. రాప్తాడులోనూ ఇదే పంతాతో తమపై ప్రచారాలు చేస్తున్నారన్నారు. ఎవరెన్ని ఆరోపణలు చేసినా పరిటాల కుటుంబం అంటే జిల్లా ప్రజలు అందరికీ తెలుసుకున్నారు. అక్రమాలకు పాల్పడిన వారికి ప్రజాక్షేత్రంలో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు.

నిరాదరణకు గురైన బాలల కోసం

'మిషన్‌వాత్సల్య'

కలెక్టర్ బసంత్ కుమార్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

నిరాధరణకు గురైన బాలలను ఆదుకునేందుకే కేంద్ర ప్రభుత్వం మిషన్ వాత్సల్య పథకాన్ని తీసుకొచ్చిందని కలెక్టర్ బసంత్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అనాథలుగా ఉన్న బాలలు, తల్లిదండ్రులను కోల్పోయిన వారు, తల్లి లేక తండ్రిని కోల్పోయిన వారు, వితంతువు, విడాకులు తీసుకున్న, కుటుంబాన్ని వదిలేసిన తల్లిదండ్రులు, ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న తల్లిదండ్రుల పిల్లలు, ఆర్థికంగా, శారీరకంగా పెంచలేని నిస్సహాయ తల్లిదండ్రుల పిల్లలు ఈ పథకానికి అర్హులన్నారు. కేంద్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఒకటి నుంచి 18 సంవత్సరాలు వయస్సు ఉన్న పిల్లలకు ఈ పథకం కింద నెలకు రూ.4వేల స్కాలర్‌షిప్ అందజేయనున్నట్లు తెలిపారు. గ్రామ మహిళా కార్యదర్శి, అంగన్‌వాడీ కార్యకర్త, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు దరఖాస్తులను పూర్తి చేసి జిల్లా ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి కార్యాలయానికి ఈనెల 15వ తేదీ లోపు అందజేయాలని కోరారు. బాలుడు, బాలిక జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు జిరాక్స్, తల్లి ఉంటే తల్లి, తండ్రి ఉంటే తండ్రి ఆధార్ కార్డు, వీరిలో ఎవరు మృతిచెందినా వారి మరణ ధ్రువీకరణ పత్రం, గార్డియన్ ఉంటే ఆధార్, రేషన్ కార్డులు, కుల ధ్రువీకరణ పత్రం, పిల్లల పాస్‌పోర్ట్ ఫొటోలు, ఆదాయ ధ్రువీకరణ, స్టడీ సర్టిఫికెట్‌తోపాటు బ్యాంకు జాయింట్ అకౌంట్ నెంబర్ జిరాక్స్ సమర్పించాలని కోరారు.

బాలయ్యా.. భ్రమలో నుంచి బయటకు రా..

రాష్ట్రంలో సైకో ఎవరో ప్రతి ఒక్కరికీ తెలుసు - మున్సిపల్ ఛైర్‌పర్సన్ డిఎన్ ఇంద్రజ

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ డిఎన్ ఇంద్రజ

ప్రజాశక్తి-హిందూపురం

సినీనటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సినిమా ఘూటింగ్‌ల నుంచి బయటకు వచ్చి వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను చూస్తే అభివృద్ధి అంటే ఏంటో తెలుస్తుందని మున్సిపల్ ఛైర్‌పర్సన్ డిఎన్ ఇంద్రజ సూచించారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్సీ షేక్ మొహమ్మద్ ఇక్బాల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇప్పటి వరకు హిందూపురం మున్సిపాలిటీకి ఒక్క రూపాయి కూడా నిధులను కేటాయించని బాలయ్య రాష్ట్రస్థాయి బడ్జెట్ గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రూ.2.79 లక్షల కోట్లు బడ్జెట్ ఉంటే రూ.17లక్షల కోట్లు అని చెప్పడంతోనే ఆయనకు బడ్జెట్‌పై ఉన్న అవగాహన అర్థం అవుతుందన్నారు. ప్రజారంజక పాలన అందిస్తూ దేశంలోనే అందరికీ ఆదర్శంగా నిలుస్తూ, సంక్షేమ పాలన అందిస్తున్న సిఎం జగన్‌ను విమర్శించే స్థాయి, నైతిక అర్హత కనీస రాజకీయ పరిజ్ఞానం లేని మీకు లేదన్నారు. ఇకపోతే రాష్ట్రంలో సైకో ఎవరో ప్రతి ఒక్కరికీ తెలుసు అన్నారు. మీరు అధికారంలో ఉన్నప్పుడు కనీసం మురుగు నీటి వ్యవస్థను కూడా బాగు చేయలేదని గుర్తు చేశారు. నాడు దివంగత సిఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా హిందూపురం ప్రజల దాహార్తిని తీర్చడానికి కోసం రూ.650 కోట్లతో పిఎబిఆర్ నీటి పథకాన్ని తీసుకొచ్చారన్నారు. ఆ పథకాన్ని పట్టించుకోకపోగా కేవలం కమీషన్లకు కక్కుర్తి పడి జల కేటాయింపులు లేని గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి రూ.194 కోట్లు వెచ్చించి వీటిని తీసుకొచ్చారన్నారు. మీరు చేసిన పాపానికి పురపాలక సంఘం రూ.63 లక్షలు ప్రతినెలా కట్టాల్సి వస్తోందన్నారు. 1983 నుంచి ఇప్పటి వరకు మీ కుటుంబానికి పట్టం కడుతుంటే హిందూపురానికి ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. మీరు సెల్ఫీలు తీసుకోవాలకుంటే మీ అల్లుడు చేపట్టిన పాదయాత్రలో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌ల వద్ద నిలబడి సెల్ఫీలు తీసుకోవాలని సూచించారు. ఇంకా సమయం ఉంటే రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ, జలకళ, విత్తనాల పంపిణీ, ఆసరా, అమ్మఒడి, విద్యాదీవెన, విద్యాకానుక, జగనన్న గోరుముద్ద, చేయూత, వాహనమిత్ర వంటి పథకాలను తీసుకుంటున్న లబ్ధిదారులను కలిస్తే అభివృద్ధి ఏంటో చెబుతారని సూచించారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు పురుషోత్తంరెడ్డి, కౌన్సిలర్లు నాగేంద్రబాబు, రోషన్‌అలీ, ఆయూబ్, మణి, రహమ్మత్‌బీ, మల్లికా బాను పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను విమర్శించే స్థాయి 'కిరణ్'కు లేదు..

ఎఐసిసి సభ్యుడు కోటా సత్యనారాయణ

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

వందేళ్లకుపైగా చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీని విమర్శించే స్థాయి మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డికి లేదని ఎఐసిసి సభ్యుడు కోటా సత్యనారాయణ అన్నారు. శనివారం పుట్టపర్తిలో విలేకరులతో మాట్లాడుతూ కిరణ్‌కుమార్‌రెడ్డికి రాజకీయ భిక్ష పెట్టింది కాంగ్రెస్ పార్టీ అనే సంగతి తెలుసుకోవాలన్నారు. నేడు బిజెపిలోకి వెళ్లి కాంగ్రెస్‌లో ఏకపక్ష నిర్ణయాలు, ఒంటెద్దు పోకడలో పోతోందని విమర్శించడం 'తల్లి పాలు తాగి రొమ్ము గుద్దినట్లుగా ఉందన్నారు. నీకు ఎలాగూ బుద్ధి లేదు బిజెపి వారికైనా సిగ్గు ఉండొద్దా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆనాడు కాంగ్రెస్‌లో ఎందురో సీనియర్లు ఉన్నప్పటికీ ఏ అర్హత ఉందని నీకు సీఎం పదవి వచ్చిందో చెప్పాలన్నారు. నీ పదవీకాలంలో ముగిసిన వెంటనే సమైక్యాంధ్ర పార్టీ పెట్టి చెప్పు గుర్తుతో పోటీ చేసిన నీకు ఒక్క సీటు కూడా దక్కలేదన్నారు. ఇప్పుడు బిజెపిలోకి పోయి రాజకీయ భిక్ష పెట్టిన పార్టీ విమర్శించడం పద్ధతి కాదన్నారు. సముద్రం లాంటి పార్టీలో నీలాంటి వాళ్లు బయటకు పోయినంత మాత్రాన నష్టమేమీ లేదన్నారు.

సిఎం సారూ..ఉద్యోగుల వేతనాలు, పెన్షన్లకూ బటన్ నొక్కండి..

ఎపిజెఎసి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు మైనుద్దీన్

అంబేద్కర్ సర్కిల్‌లో నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన తెలుపుతున్న ఎపి జెఎసి ఉద్యోగులు

ప్రజాశక్తి-హిందూపురం

'సిఎం సారూ.. సంక్షేమ పథకాలకే కాదు.. ఉద్యోగుల వేతనాలు, పెన్షన్లకు కూడా బటన్‌లు నొక్కితే బాంటుంది సారూ..' అంటూ జిల్లా ఎపి జెఎసి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు మైనుద్దీన్ సూచించారు. ఎపి జెఎసి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో నల్ల కండువాలు ధరించి నిరసన తెలిపారు. ఇందులో భాగంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, ప్రభుత్వ కార్యాలయాల వద్ద వాల్‌పోస్టర్లను అతికించారు. అనంతరం మైనుద్దీన్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల పట్ల ఇంత నిర్లక్ష్యం ఏ ప్రభుత్వం వ్యవహరించలేదన్నారు. ఆఖరికి ఉద్యోగులు ఉద్యమాలు చేస్తున్నా పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించకపోతే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నారాయణస్వామి, జీలన్, మల్లికార్జున, ఇర్షాద్, నరసింహులు, జమ్మన్న, పెద్ద ఎత్తున ఉద్యోగులు, పెన్షనర్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

బాగేపల్లి న్యూస్..

సిపిఎం అభ్యర్థి డాక్టర్ అనిల్‌కుమార్‌కు సంఘీబావం తెలుతున్న పార్టీలోకి చేరిన ప్రముఖులు

పాతపాళ్యంలో పార్టీకి పూర్వ వైభవం

సిపిఎం కర్నాటక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవరాజు

ప్రజాశక్తి-చిలమత్తూరు(బాగేపల్లి నుంచి)

బాగేపల్లి తాలుకా పాతపాళ్యం హుబ్లీలో సిపిఎంకి పూర్వ వైభవం వచ్చిందని ఆపార్టీ కర్నాటక రాష్ట్ర కార్యదర్శి బసవరాజు అన్నారు. ఈమేరకు సిఎఇం రాష్ట్ర కార్యదర్శి బసవరాజు, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ అనిల్‌కుమార్, జిల్లా కార్యదర్శి మునివెంకటప్ప ఆధ్వర్యంలో గతంలో వివిధ కారణాలతో పార్టీకి దూరంగా ఉన్న పూర్వ నాయకులు, పలువురు ప్రముఖులు 200 మంది సిపిఎంలో చేరారు. ఈ సందర్భంగా సిపిఎం అభ్యర్థి అనిల్‌కుమార్ మాట్లాడతూ 'ప్రజల కోసం సిపిఎం, సిపిఎం కోసం ప్రజలు' నినాదంతో పార్టీ ముందుకు పోతోందన్నారు. ముఖ్యంగా అభివృద్ధే అజెండాగా పార్టీ తీసుకున్న విధానంతో పూర్వ నాయకులు, కార్యకర్తలు ముందుకొచ్చి పార్టీలో చేరి ఎర్రజెండాకు అండగా నిలవడంతో పార్టీ నిండుగా మారిందన్నారు. కమ్యునిష్ట్ పార్టీని గెలిపించుకోవడానికి అభివృద్ధిని కాంక్షించే ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన వారిలో అమర్‌నాథ్‌రెడ్డి, నారాయణరెడ్డి (గుజ్జేపల్లి), శ్రీనివాసులు(గుడిపల్లి), నంజుడప్ప (గుండవారపల్లి), మునెప్ప, అంజినప్ప, ఆదినారాయణ, క్రిష్టప్ప, సురేంద్ర, వెంకటేష్, సంతోష్, నంజుడప్ప, అంజి, అనీల్‌లు ఉన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం తాలుకా నాయకులు రఘురామిరెడ్డి, శ్రీనివాసులు, శ్రీరామప్ప, ఓబుళరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-కదిరిటౌన్

ఎపి జెఎసి అమరావతి పిలుపుమేరకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం స్థానిక అంబేద్కర్ విగ్రహం ఎదుట కదిరి డిపో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక డిపో ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.దివాకర్, పి.శంకరప్ప ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం సమస్యలపై పోస్టర్లు విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రతినెలా 1వతేదీ జీతాలు, పెన్షన్లు చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డిఎల అరియర్స్ ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న మూడు డిఎలను ప్రకటించాలని, ఇహెచ్‌ఎస్ కార్డు ద్వారా క్యాష్‌లెస్ వైద్యం అందించాలని, 13బి, 2బి, 2023రోజున సిఎస్‌కి ఇచ్చిన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ సీనియర్ నాయకులు ఎన్‌ఎం.బాషా, గంగాధర్, సుధీందర్, కెకె.బాషా, కోశాధికారి కె.హరికుమార్, టి.జి.రెడ్డి, టిజెడ్.ఖాన్, విశ్వనాథరెడ్డి, అనిల్‌సింహా, ఎన్‌బి.రెడ్డి, ఎ.కుళ్లాయప్ప, ఎం.రవి, రమణ, మహిళా నాయకురాళ్లు భూదేవి, నాగమణిమ్మ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : సిపిఎస్‌ను రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్ని కొనసాగించాల్సిందే.. అని రామగిరి తహశీల్దార్ నారాయణస్వామి డిమాండ్ చేశారు. ఎపి జెఎసి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎంప్లాయిస్ యూనియన్ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు కెబి నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగులు శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఏల అరియర్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పీఆర్‌సీ అరియర్స్ చెల్లించాలని, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, కొత్త జిల్లాల్లో 16శాతం హెచ్‌ఎస్‌ఏ ఇవ్వాలని, 12వ పే రివిజన్ కమిషన్‌ను వెంటనే నియమించాలని, ఉద్యోగులకు 1వతేదీనే జీతాలు, పెన్సన్లు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో ప్యాధిండి వీఆర్ రాఘవరెడ్డి, కనగానపల్లి విఆర్ఓ మురళి, డిపో సీనియర్ నాయకులు శ్రీరాములు, టీఐ పెద్దక్క, ఎడిసిలు టీఎస్ మూర్తి, మల్లికార్జున, సిస్టమ్ సూపర్‌వైజర్ సుధాకర్, రీజినల్ నాయకులు బి.నరసింహులు, ఆదినారాయణ, డిపో కార్యదర్శి ముస్తాఫా, గ్యారేజ్ కార్యదర్శి మల్లికార్జున, డిపో ఛైర్మన్ సుమో శీనా, తదితరులు పాల్గొన్నారు.

ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగుల నిరసన

కదిరిలో ధర్నా చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

నేరాలు ఘోరాలు

రేషన్ బియ్యం పట్టివేత

పట్టుబడిన రేషన్ వివరాలు వెల్లడిస్తున్న విజిలెన్స్ సిఐ సాయిప్రసాద్

ధర్మవరం టౌన్ : అక్రమంగా తరలిస్తున్న రేషన్‌ను పట్టుకున్నామని విజిలెన్స్ సిఐ సాయిప్రసాద్ తెలిపారు. పట్టుబడిన బియ్యాన్ని పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఉంచారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ పట్టణంలోని ప్రియాంకనగర్ వద్ద ఉన్న పెట్రోల్ బంకు సమీపంలో స్టోర్ బియ్యాన్ని వాహనాల్లో లోడు చేస్తున్నారని సమాచారం రావడంతో ఉదయాన్నే వెళ్లి దాడులు చేశామన్నారు. దీంతో ఐచర్ వాహనంలోకి లోడు చేసుకుంటున్న 14 టన్నుల బియ్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. వీటి విలువ దాదాపు రూ.3లక్షలకుపైగా ఉంటుందన్నారు. ఐచర్, బొలెరో వాహనాలతోపాటు మూడు ఆటోలను సీజ్ చేసి రేషన్‌ను పెద్ద మనుషుల సమక్షంలో రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ ఎఇ రవీంద్ర, రెవెన్యూ ఆర్ఐ రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

మోటార్ల వైర్ల దొంగలు అరెస్టు

బత్తలపల్లి : మండలంలోని మాల్యవంతం గ్రామంలో వరుస కేబుల్ వైర్లు చోరీకి పాల్పడుతున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు బత్తలపల్లి ఎస్ఐ టీవీ శ్రీహర్ష తెలిపారు. ఈమేరకు శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనంతపురంలోని నాయక్‌నగర్‌కు చెందిన మామిళ్ల రామకృష్ణ, బత్తలపల్లి మండలం ఎ.మాల్యవంతం గ్రామానికి చెందిన సాకే అశోక్ స్నేహితులు. వీరిద్దరూ కలిసి మాల్యవంతంలో రైతులకు సంబంధించిన వ్యవసాయ పరికరాలు, కేబుల్ వైర్లను చోరీ చేసి కర్నాటకలో అమ్మేవారు. అంతేగాకుండా అక్కడే ఇద్దరూ మద్యం కొనుగోలు చేసి తాగడం, జల్సాలకు అలవాటు పడ్డారు. వీరిపై అనుమానంతో ప్రత్యేక దృష్టి సారించి నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నిందితులతోపాటు కేబుల్ వైర్లు, ఐదు విస్కీ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకోవడంతో ప్రతిభ కనబరిచిన హెడ్ కానిస్టేబుల్ శ్రీరాములు, కానిస్టేబుళ్లు సుదర్శన్‌నాయుడు, ఆంజనేయులు, జనార్ధన్‌రెడ్డిని అభినందించారు.

ట్రాక్టర్ బోల్తా.. వ్యక్తికి తీవ్ర గాయాలు

పుట్టపర్తి రూరల్ : మండల పరిధిలోని జగరాజుపల్లి క్రాస్ వద్ద శనివారం ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడటంతో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు గోరంట్ల వైపు నుంచి రాళ్లలోడుతూ వెళున్న ట్రాక్టర్ జగరాజుపల్లి క్రాస్ వద్దకు రాగానే అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో పక్కనే ఉన్న జగరాజుపల్లికి చెందిన తిప్పారెడ్డిపై ట్రాక్టర్ ట్రాలీలో ఉన్న రాళ్లు పడటంతో రెండు కాళ్లు విరగడంతోపాటు తలకు తీవ్రగాయాలు అయ్యాయి. వెంటనే స్థానికులు అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు పుట్టపర్తి రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సరితాల బాషాను సన్మానిస్తున్న దూదేకుల సంఘం నాయకులు

దూదేకుల సంఘం జిల్లా అధ్యక్షునిగా సరితాల బాషా

ధర్మవరం టౌన్ : దూదేకుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షునిగా సరితాల బాషా నియమితులయ్యారు. ఈమేరకు శనివారం కడప జిల్లా పులివెందులలో జరిగిన దూదేకుల సంక్షేమ సంఘం సమావేశంలో ధర్మవరం 28వ వార్డుకు చెందిన సరితాల బాషా జిల్లా అధ్యక్షునిగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా బాషా మాట్లాడుతూ తనను జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్న దూదేకుల, ముస్లిం మైనార్టీ, సంక్షేమ సంఘం కుటుంబ సభ్యులు, రాష్ట్ర (నూర్‌బాషా) దూదేకుల ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రసూల్ సాహెబ్ బాలమునికి కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి పదవి కట్టబెట్టినందుకు వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా సంఘం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అంతేగాకుండా జిల్లావ్యాప్తంగా పర్యటించి నియోజకవర్గ, మండల కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు

ఎస్ఐ సురేష్‌బాబు

మడకశిర : ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ సురేష్‌బాబు హెచ్చరించారు. నూతన ఎస్ఐ నియమితులైన సురేష్‌బాబు శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ నాగేంద్ర వివిధ ఆరోపణలు ఎదుర్కోవడంతో విఆర్‌కు బదిలీ చేశారు. దీంతో సురేష్‌బాబు బాధ్యతలు స్వీకరించి మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఎవరైనా చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

రైతు సదస్సుకు తరలిన నాయకులు

బత్తలపల్లి : బత్తలపల్లి :రైతు సదస్సుకు ధర్మవరం నియోజకవర్గం నుండి భారీగా తరలి వెళ్లారు. తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం కార్యక్రమంలో భాగంగా గార్లదిన్నె మండలం జంబులదిన్నె సమీపంలో రైతు సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ధర్మవరం నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి భారీగా టిడిపి నాయకులు రైతులు తరలి వెళ్లారు. నియోజవర్గం తెలుగు రైతు సంఘం అధ్యక్షుడు చల్లా శ్రీనివాసులు, తెదేపా మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి, గోను గుంట్ల అమర్, యర్రయ్యపల్లి సుబ్బరాయుడు, ముదిగుబ్బ రమేష్ బాబు, కేశవరెడ్డి, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

రైతుసదస్సులో పాల్గొన్న బత్తలపల్లినాయకులు

NAME CHANGE

I **SHAIK SOBIYA ANJUM** (Old Name) W/O AGHA MIRZA ALI RAZA ISFAHANI, H.No.26-4-1205, Shanthinagar Hindupur, Sri Sathyasai District, Changing My Name From **SHAIK SOBIYA ANJUM** (Old Name) to **SOOBIA ANJUM** (New Name), Hence forth I am being called as SOOBIA ANJUM for all purposes.

పకడ్బందీగా 'పది' పరీక్షలు

కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను కలెక్టర్ బసంతకుమార్ శనివారం పరిశీలించారు. ఇందులో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఇంగ్లీస్ పరీక్ష రాస్తుండగా క్లాస్‌రూమ్‌లోకి వెళ్లిన కలెక్టర్ ప్రశ్నపత్రం ఎలా ఉంది.. ప్రశ్నలకు జవాబులు ఎలా రాస్తున్నారు.. అంటూ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ధర్మవరం డివిజన్‌లోని 62 పరీక్ష కేంద్రాల్లో 10,441 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 87 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఇన్‌ఛార్జి డిఇఒ మీనాక్షి తెలిపారు. ఆయా పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

బత్తలపల్లి : మండల కేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదవ తరగతి పరీక్షలను కలెక్టర్ బసంతకుమార్ శనివారం ఆకస్మింగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఎంతమంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నారు.. ఎంత మంది హాజరవుతున్నారు.. ఎంత మంది గైర్హాజర్ అవుతున్నారు.. కేంద్రాల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై స్థానిక సిబ్బందిని ఆరాతీశారు. ఈ సందర్భంగా బత్తలపల్లిలో మూడు కేంద్రాల్లో 483 మంది పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 478 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు స్థానిక సిబ్బంది వివరించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, ప్రశాంతంగా పరీక్షలు రాసేలా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ యుగేశ్వరీదేవి, చీఫ్‌లు ఉమాపతి, ముకుందనాయుడు, జగన్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : జిల్లావ్యాప్తంగా 125 సెంటర్లలో పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించినట్లు డిఇఒ మీనాక్షి తెలిపారు. ఇందులో భాగంగానే శనివారం ఇంగ్లీష్ పరీక్ష నిర్వహించగా జిల్లావ్యాప్తంగా 22,251 మంది హాజరుకావాల్సి ఉండగా 205 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో సిట్టింగ్, డిపార్ట్‌మెంటర్ అధికారులు తనిఖీ చేసినట్లు తెలిపారు.

గోరంట్ల : పట్టణంలోని జడ్పీ హైస్కూల్, ప్రభుత్వ బాలికల పాఠశాల, వివేకానంద పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి పరీక్ష కేంద్రాలను తహశీల్దార్ రంగనాయకులు శనివారం పరిశీలించారు. ఇందులో భాగంగా ఆయా కేంద్రాల్లో మంచినీటి సౌకర్యం, అందుబాటులో ఉన్న వైద్యసిబ్బందితోపాటు మౌలిక వసతులపై ఆరాతీశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ఎండ తీవ్రంగా ఉంటున్న నేపథ్యంలో విద్యార్థులకు నిత్యం తాగునీరు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

బత్తలపల్లిలోని బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ బసంతకుమార్

నేడు అంధుల సాంస్కృతిక కార్యక్రమాలు

పుట్టపర్తి అర్బన్ : పట్టణంలోని శిల్పారామంలో ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అంధుల నిరీక్షణ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.గంగన్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం స్థాపన దినోత్సవం సందర్భంగా అంధ కళాకారులు సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో నాట్యకళా ప్రదర్శనలు, సంగీత విభావరి ఉంటుందన్నారు. ముఖ్యంగా జబర్దస్త్ టీం గాజువాక కండక్టర్ ఝాన్సీ, రమేష్ మాస్టార్ పాల్గొని అంధులను మరింత ప్రోత్సహించనున్నట్లు తెలిపారు.

విలేకరులతో మాట్లాడుతున్న వామపక్షాల నాయకులు

వామపక్షాల పాదయాత్రను జయప్రదం చేయండి

కదిరిటౌన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి చేపట్టనున్న పాదయాత్రను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య, సిపిఎం పట్టణ కార్యదర్శి జిఎల్ నరసింహులు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. ముఖ్యంగా కార్పొరేట్ కంపెనీలకు కొమ్ముకాస్తూ ప్రభుత్వ రంగసంస్థలను నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. ఇందులో భాగంగానే విశాఖ ఉక్కు, ఎల్ఐసి, బ్యాంకులు ప్రయివేటీకరణ, కడప ఉక్కు, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ, రైతాంగ సమస్యలు, కార్మికులకు లేబర్ కోడ్‌లు, తిరుపతి విమానాశ్రయం ప్రయివేట్‌పరం, రైతుల వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించడం వంటి అంశాలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆయా సమస్యలపై ప్రజలను చైతన్యవంతం చేసేందుకు వామపక్షాల ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబ్‌జాన్, సిఐటియు జగన్మోహన్, సిపిఐ డివిజన్ కార్యదర్శి కదిరప్ప, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి అంటేనే వైసిపి ప్రభుత్వం

'మా నమ్మకం నువ్వే జగన్'లో నాయకులు

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

అభివృద్ధి అంటేనే వైసిపి జగన్ ప్రభుత్వమని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని వేమారెడ్డిపల్లి, ఆకుతోటపల్లి, బాబాసాహెబ్‌పల్లి తదితర గ్రామాల్లో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయడంతోపాటు ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించాల్సిన బాధ్యత ప్రతి వైసిపి నాయకుడు, కార్యకర్తలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ కన్వీనర్ కోళ్ల కృష్ణారెడ్డి, మండల కన్వీనర్ రాజునాయుడు, జెడ్పిటిసి కుర్లి దామోదర్‌రెడ్డి, ఎంపిపి పర్వీన్‌భాను, సర్పంచులు గోవిందు, ఆబీద, షాజియా, రఫిక్, మజీద్, షామీర్‌బాషా, లక్ష్మిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, మలక అశ్వత్‌రెడ్డి, జానీ బాషా, మండేజి అరీఫ్‌ఖాన్, చంద్రమౌళినాయుడు, రామలింగారెడ్డి, నాయకులు, కార్యకర్తలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : మండల కేంద్రంలో వైసిపి నాయకులు శనివారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎంపిపి తాతం జగన్మోహన్, వైసిపి మండల కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డితోపాటు గృహసారథులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతోనే సిఎం జగన్ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. పథకాలన్నీ అర్హులకు అందుతున్నాయా.. లేదా అని తెలుసుకోవడంతోపాటు పథకాలను వివరిస్తూ స్టిక్కర్లను ప్రతి ఇంటికీ అతికించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి భాస్కర్‌రెడ్డి, జెఎసి జి.రవీంద్రారెడ్డి, గృహసారథి మహమ్మద్ ఫరూక్, సచివాలయ కన్వీనర్లు, వాలంటరీలు, తదితరులు పాల్గొన్నారు.

మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

అధైర్య పడకండి.. అండగా ఉంటాం : పరిటాల

కనగానపల్లి : అధైర్య పడకండని.. కుటుంబానికి అండగా ఉంటామని టిడిపి నాయకులు హరిజన సూర్యనారాయణ కుటుంబ సభ్యులకు మాజీమంత్రి పరిటాల సునీత భరోసా ఇచ్చారు. మండల పరిధిలోని కోనాపురం గ్రామానికి చెందిన సూర్యనారాయణ అనారోగ్యం కారణంగా శనివారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పరిటాల సునీత గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ కుటుంబం అధైర్య పడకూడదని, తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ యాతం పోతలయ్య, రాష్ట్ర కార్యదర్శి నెట్టెం వెంకటేష్, తెలుగు యువత బట్టా సురేష్‌చౌదరి, గ్రామ కమిటీ అధ్యక్షుడు గిరీషలా రాము, కసుమూర్తి వెంకటేష్, అరుణ, పురుషోత్తం, మాజీ సర్పంచి ముకుంద, కేపీ ముత్యాలు, రవి, తదితరులు పాల్గొన్నారు.

ఫాదర్ ఫెర్రర్ జయంతికి ఏర్పాట్లు



ముస్తాబవుతున్న ఫెర్రర్ సమాధి

బత్తలపల్లి : ఆర్డీటీ సంస్థను ఏర్పాటు చేసి కరువుతో అల్లాడుతున్న పేదలను ఆదుకునేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టిన ఆర్డీటీ వ్యవస్థాపకులు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా ఫెర్రర్ ఘాట్ వద్ద శనివారం చేపట్టిన ఏర్పాట్లను రీజినల్ డైరెక్టర్ ప్రమీల, ఎటిఎల్ రుక్మాంగద పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫెర్రర్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అన్నేఫెర్రర్, ప్రోగ్రాం డైరెక్టర్ మాంచూ ఫెర్రర్ కలిసి ఘాట్ వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నట్లు తెలిపారు. అలాగే ఇండియా ఫర్ ఇండియా పేరుతో ఏర్పాటు చేసిన హుండీలను లెక్కించి కొత్త హుండీలను అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. బత్తలపల్లి, తాడిమర్రి మండలాల్లో దాదాపు 4.316 హుండీలను లెక్కించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా మండలంలోని కోడేకండ్ల గ్రామంలో ఉమెన్స్ సెక్టార్ డైరెక్టర్ విశాలా ఫెర్రర్ పర్యటించనున్నట్లు తెలిపారు. అలాగే హౌసింగ్ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఐదుగురు బృందం ఈదుల ముష్టూరు గ్రామాన్ని సందర్శించి హుండీలను లెక్కించనున్నట్లు తెలిపారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని అల్ హి లాల్ పాఠశాల ఆవరణలో ట్రినీటి సర్వీసెస్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు డాక్టర్ కుమార్‌రాజ్ ఆధ్వర్యంలో బెంగళూరుకు చెందిన శంకర్ కంటి అసుపత్రి సౌజన్యంతో శనివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భం గా 575 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 175 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. అలాగే గతనెల ఆపరేషన్లు చేసిన వారికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శంకర కంటి ఆసుపత్రి బృందం, డాక్టర్ అను, క్యాంపు ఇన్‌ఛార్జి శివప్రకాష్, ట్రినిటీ సర్వీసెస్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ కుమార్‌రాజ్, సెక్రటరీ కె.ఉషారాణి, జామీయ మసీదు ముతవల్లి నూరుల్లా, కమిటీ సభ్యులు, వాలంటీర్ల అధ్యక్షుడు షమీమ్, జాకీ, తదితరులు పాల్గొన్నారు.

గుండె జబ్బు బాధితునికి పరామర్శ

రొద్దం : మండలంలోని కంబాలపల్లి గ్రామానికి చెందిన టిడిపి నాయకులు గోవర్ధన్‌యాదవ్ బైపాస్ సర్జరీ చేయించుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటుండగా విషయం తెలుసుకున్న ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అధైర్యపడవద్దని తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆమె వెంట సీనియర్ టిడిపి నాయకులు మాధవనాయుడు, పెనుకొండ మాజీ మండల కన్వీనర్ శ్రీరాములు, మాజీ ఎంపిపి నరసింహులు, సర్పంచి మంజు, తదితరులు పాల్గొన్నారు.

కాక రేపుతున్న లోకేష్ యాత్ర

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర జిల్లాలో రాజకీయ కాక రేపుతోంది. గతనెలలో జిల్లాలోకు వచ్చిన పాదయాత్ర ఇంకా కొనసాగుతూనే ఉంది. ఈ యాత్ర సందర్భంగా ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపుతూనే స్థానిక సమస్యలు, అధికార పార్టీ ప్రజాప్రతినిధులపై అనేక ఆరోపణలు చేస్తూ వెళ్తున్నారు. దీంతో ఆయా నియోజకవర్గాల్లో పాదయాత్ర సాగుతున్న సమయంలో అధికార పార్టీ నుంచి ప్రత్యారోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇది రాజకీయ వేడిని రాజేస్తున్నాయని చెప్పవచ్చు. పుట్టపర్తిలో ప్రారంభమైన ఆరోపణ, ప్రత్యారోపణల పర్వం ఇప్పుడు శింగమల వరకు సాగుతూనే ఉంది. పుట్టపర్తిలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మధ్య తీవ్రస్థాయిలో వాదోపవాదనలు జరిగిన విషయం తెలిసిందే. సత్యమ్మ గుడివద్ద ప్రమాణాలకు సిద్ధపడటంతో రెండు గ్రూపులు మోహరించుకుని ఘర్షణకు సైతం దిగారు. ఆ తరువాత రాప్తాడు జాకీ పరిశ్రమ తరలిపోవడంపై ఇటు పరిటాల శ్రీరామ్, అటు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మధ్య మాటల యుద్ధం సాగిందని చెప్పవచ్చు. టిడిపికి ఆరోపణలకు రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి ప్రత్యారోపణలు చేస్తున్నారు. జాకీ పరిశ్రమకు తక్కువ ధరకు భూములు కట్టబెట్టి డబ్బులు కాజేసారని ఆరోపిస్తున్నారు. దీనికి టిడిపి వైసిపి ఎమ్మెల్యే బెదిరింపులతోనే జాకీ పరిశ్రమ రాకుండాపోయిందని పరిటాల కుటుంబం ఆరోపిస్తోంది. అదే సమయంలో ధర్మవరంలో చెరువు కట్ట ఆనుకుని యర్రగుట్టను ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి కబ్జా చేసారని ఆరోపించడమే కాకుండా గూగుల్ మ్యాప్ విడుదల చేశారు. దీంతోపాటు నియోజకవర్గంలో పలుచోట్ల భూములు కబ్జా చేశారని ఆరోపిస్తూ మరో ప్రకటన చేశారు. దీనిపై ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి ప్రత్యారోపణలకు దిగారు. తప్పుడు ప్రచారం తనపై చేస్తున్నారని, తాను ఆ భూములు కొనుగోలు చేసినట్టు వివరణ ఇస్తున్నారు. ఇక అనంతపురం నియోజకవర్గంలో అభివృద్ధి పనుల్లో స్థానిక ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి కమీషన్లు తీసుకున్నారంటూ ఆరోపణలు చేశారు. దీనిపై నగర మేయర్ వసీం, ఇతర నేతలతోపాటు, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రతిస్పందించారు. నిరాధారమైన ఆరోపణలు చేయడాన్ని కొట్టిపారేశారు. ఉరవకొండ, శింగనమల నియోజకవర్గాల్లోనూ అక్కడి వైసిపి నాయకులు భూకబ్జాలకు పాల్పడ్డారని నారా లోకేశ్ ఆరోపించారు. వీటిని ఆ పార్టీ నాయకులు తిప్పికొట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఈ రకంగా పాదయాత్ర సాగిన క్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులపై లోకేశ్ చేస్తున్న ఆరోపణలతో రాజకీయ వేడి రాజుకుంటోంది. మరోవైపు లోకేశ్ పాదయాత్ర మర్తాడుతో 800 కిలోమీర్లు పూర్తయింది. ఈ సందర్భంగా జరిగిన పాదయాత్రలో హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ పాల్గొని మద్దతునిచ్చారు. పాదయాత్రకు విశేషమైన స్పందన తీసుకొచ్చేందుకు ఆ పార్టీ నేతలు పూర్తి స్థాయిలో కసరత్తులు చేస్తున్నారు జనసమీకరణ చేపడుతున్నారు. అదే సమయంలో యాత్రలోనూ స్వల్ప మార్పులు సైతం చేపట్టారు. మొదట నిర్ణయించి ప్రకారం కళ్యాణదుర్గం, రాయదుర్గం , గుంతకల్లు నియోజకవర్గాలూ పాదయాత్రలు ఉండేవి. ఇప్పుడు ఈ నియోజకవర్గాలకు మినహాయించారు. శింగనమల అనంతరం తాడిపత్రిలో ప్రవేశించి కర్నూలు జిల్లాకు యాత్ర చేరుకునే అవకాశముంది. వచ్చే వారంతో పాదయాత్ర జిల్లాలో ముగిసే అవకాశముంది. మొత్తంగా ఈయాత్ర ఇప్పుడే ఎన్నికలు రానున్నాయా అన్నట్టుగా వాడివేడిగా మొదలయ్యాయి.

పుట్టపర్తి రూరల్ ఎస్ఐగా దాదాపీర్

పుట్టపర్తి రూరల్ : పుట్టపర్తి రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా దాదాపీర్‌ను నియమించారు. ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్ ఆదేశాల మేరకు ఇక్కడ పనిచేస్తున్న బాబ్‌జాన్‌ను విఆర్‌కు పంపారు. ఆయన స్థానంలో విఆర్‌లో ఉన్న దాదాపీర్‌ను ఇక్కడిని నియమించడంతో బాధ్యతలు స్వీకరించారు.

ఆర్టీసీ బస్టాండ్లలో వ్యాపారాలకు టెండర్ల ఆహ్వానం

పుట్టపర్తి అర్బన్ : సత్యసాయి జిల్లావ్యాప్తంగా ఆర్టీసీ బస్టాండ్లలో వ్యాపారం చేసుకునేందుకు టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు ఆర్టీసీ ప్రజా రవాణా శాఖ జిల్లా అధికారి మధుసూదన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా స్టాల్స్, ఆన్‌లైన్ ప్యాసింజర్, ఆన్‌లైన్ రిజర్వేషన్ కౌంటర్ సిస్టం నిర్వహణకు, పుట్టపర్తి, కదిరి, హిందూపురం, గోరంట్ల బస్టాండ్లలో మరుగుదొడ్లు నిర్వహణకు ప్రతినెలా బాడుగ చెల్లించే పద్ధతిలో టెండర్లు ప్రక్రియ ఈనెల 19న ఉంటుందన్నారు. కావున టెండరుదారులు ఆయా దరఖాస్తులను జిల్లాలోని అన్ని డిపో మేనేజర్ల కార్యాలయాల్లో ఈనెల 18 వరకు విక్రయించనున్నట్లు తెలిపారు.